https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 321 శనివారం 7-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## తెలంగాణకు 12 లక్షల కోట్ల నిధులిచ్చాం

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి




**హైదరాబాద్, ఫిబ్రవరి 6**

తెలంగాణకు తమ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. వికసిత భారత్-2047 నిర్మాణమే లక్ష్యంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందన్నారు. కానీ, తెలంగాణకు ఏమిచ్చారని ప్రశ్నిస్తున్నారని, తమ సర్కారు రూ.12 లక్షల కోట్ల నిధులతోపాటు 5,000 కి.మీ జాతీయ రహదారులను తీసుకొచ్చిందని వివరించారు. తెలంగాణకు తమ ప్రభుత్వం ఏం ఇచ్చిందో విపక్షాలకు తెల్వకపోయినా ప్రజలకు బాగా తెలుసునని శుక్రవారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో చెప్పారు. '7 హైస్పీడ్ రైల్ కారిడార్లలో హైదరాబాద్‌కే మూడు ఇచ్చాం. ఆత్మ నిర్భర భారత్ కింద రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లు ఆధునీకరించాం' అని తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. ఇటీవల ఈయూతో చేసుకున్న ఒప్పందంతో టెక్స్‌టైల్ ఎగుమతులు భారీగా పెరుగుతాయని ఆయన చెప్పారు.

## బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్లే

మహేశ్‌కుమార్‌గౌడ్‌తో నాది విక్టరీ జోడీ
రెండోసారి అధికారంలోకు తీసుకొస్తాం
నిజామాబాద్ బర్ధీపూర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**నిజామాబాద్, ఫిబ్రవరి 6**

మాజీ సీఎం కేసీఆర్‌కు ఇద్దరు పుత్రులు ఉన్నారని, ఒకరు దొంగ పుత్రుడు కేటీఆర్ అని, మరొకరు దత్తపుత్రుడు కిషన్‌రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జైలుకు వెళ్లకుండా ఆయనే కాపాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని రాష్ట్ర బీజేపీ నేతలే చెప్పారని, ఆ కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో జైలుకు పంపుతామన్నారని తెలిపారు. కానీ, తాము ఆ కేసును సీబీఐకి అప్పగించి ఆరు నెలలు దాటుతున్నా ఎందుకు అరెస్ట్ చేయడంలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో కేసీఆర్, హరీశ్‌రావును జైలుకు పంపాలంటూ ఎంపీ అరవింద్ సవాల్ చేశారని గుర్తు చేశారు బీజేపీ, బీఆర్ఎ?సల తలలు వేరైనా.. శరీరం ఒక్కటేనని, వారు వీణ-వాణిలాగా ఒకే తల ఉన్న కవల పిల్లలని విమర్శించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బర్ధీపూర్ వద్ద నిర్వహించిన ప్రజా పాలన ప్రగతిబాట బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలుసుకొని ఆయనను జనజీవన స్రవంతిలో కలపాలని అన్నారు. ఫార్ములా ఈ-కారు రేసు కేసు ఫైలును ప్రధాని మోదీ ఆఫ?సలో ఒక మూలన పడేశారని రేవంత్ ఆరోపించారు. ఈ కేసులో కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారో చెప్పాలన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చి, అందులో ఇద్దరిని కేంద్ర మంత్రులను చేసిన రాష్ట్రానికి వారివల్ల ఒరిగిందేమీ లేదన్నారు. మూసీ ప్రక్షాళనకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదని, హైదరాబాద్‌లో మెట్రో పొడిగింపునకు కేంద్రం నిధులు తెస్తామంటే తాము వద్దన్నామా? అని ప్రశ్నించారు. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయడంలో ఎంపీ అరవింద్ విఫలమయ్యారని, మోదీ దగ్గర పరపతి ఉందని చెప్పుకొనే అరవింద్.. ఏడేళ్లలో ఎంపీగా జిల్లాకు చేసిందేమిటో చెప్పాలని అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే.. మూసీనదిలో వేసినట్టేనని సీఎం రేవంత్ అన్నారు. బీఆర్ఎ?సకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని, ఆ రెండు పార్టీలది ఫెవికల్ బంధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టాలన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, 12 ఏళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కావాలంటే ఫామ్‌హచిసలో పడుకున్న కేసీఆర్ తలలు లెక్కపెట్టుకోవాలన్నారు.

## పరీక్షలు పండుగల్లాంటివి..

వాటిని ఉత్సవంలా జరుపుకోవాలి

'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులతో మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: "అందరూ చెప్పే సలహాలు వినండి. వాటిలో మీకు సరిపోయేవి ఎంచుకోండి. మీకు నచ్చిన విధంగా మీ జీవనశైలిని మార్చుకోండి. చదువు ఒక భారంగా అనిపించకూడదు. కేవలం మార్కులపైనే కాకుండా జీవితాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టండి" అని విద్యార్థులకు ప్రధాని మోదీ సూచించారు. పరీక్షలకు ముందు విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో శుక్రవారం నిర్వహించిన 'ప్రధానితో పరీక్షా పే చర్చ-2026' తొమ్మిదో ఎడిషన్‌లో భాగంగా ఆయన వారితో సంభాషించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మోదీ పలు సూచనలు చేశారు. పరీక్షలు పండుగల్లాంటివని, వాటిని ఉత్సవాల తరహాలో జరుపుకోవాలని చెప్పారు. "మనం ఎంచుకున్న లక్ష్యం చేరుకోగలిగేలా ఉండాలి. కానీ సులభంగా సాధించగలిగేదిగా ఉండకూడదు.

ముందుగా పూర్తి ఏకాగ్రతతో మనసును అదుపులో పెట్టుకోండి. తర్వాత చదవాల్సిన అంశాలపై దృష్టి నిలిపితే విజయం ఎప్పుడూ మీ వెంటే ఉంటుంది" అని దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తన నివాసానికి వచ్చిన విద్యార్థుల బృందానికి మోదీ సూచించారు.

## ట్యాంపర్ చేస్తే జైలుకే!

మీ భూమిపై ఎవరి కన్నూ పడకుండా రక్షిస్తా..

- భూ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ప్రతి నెలా 9న మీ ముందుకొస్తా
- ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకాలు 2027 డిసెంబరు నాటికి అందరికీ ఇస్తాం
- క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే భూమి వివరాలు చూసుకోవచ్చు
- సీమ లిఫ్టుపై వైసీపీ అధినేత డ్రామాలు
- ఐదేళ్లు రసాయనాలతో లడ్డూ కల్తీ చేశారు
- అయినా సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చిందంటున్నారు
- ఆయన బాబాయే కల్తీ జరిగిందని చెప్పారు
- కర్నూలు జిల్లా కలుగొట్ల సభలో ద సీఎం చంద్రబాబు




**కర్నూలు, ఫిబ్రవరి 6:** 'భూమి అంటే మనకు నమ్మకం. విశ్వాసం.. అమ్మతో సమా నం. భూమితో మనకున్న అనుబంధాన్ని ఎవరూ చెరపలేరు. భూమి మీ ఆస్తి.. మీ భవిష్యత్. దానిపై ఇతరులు కన్నేయకుండా సర్వహక్కులు కల్పిం చాం. డిజిటల్ పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తున్నాం. మీ రికార్డులు ఎవ రూ ట్యాంపర్ చేయలేరు.. చేస్తే జైలు కు వెళ్లడం తథ్యం..' అని సీఎం చంద్రబాబు రైతులకు భరోసా ఇచ్చారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి- మీ హక్కు' గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. రైతులతో ముఖా ముఖి మాట్లాడారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. వాటిలో అన్ని వివరాలూ సక్రమంగా ఉన్నాయో లేదో వారినే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనివిధంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయని.. వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతం అవేనని చెప్పారు. భూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా 9వ తేదీన రైతుల వద్దకు వస్తానన్నారు. అధికారులు కూడా లంచాలకు స్వస్తి చెప్పి ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని సూచిం చారు. పరామర్శల పేరిట జగన్ చేస్తున్న బలప్రదర్శనలపై మండిపడ్డారు. బల ప్రదర్శన ఎన్నికలప్పుడు చూపించాలని. మిగిలిన సమయాల్లో ప్రజా సేవకు అంకితం కావాలని అన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే తాటతీస్తానని వైసీపీ నేతలను ఘాటుగా హెచ్చరించారు. చిత్రగుప్తుడిలా అన్నీ రాసుకుంటుంటాని చెప్పారు. సీఎం ఇంకా ఏమన్నారంటే.. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిపై ఫొటోలు వేసుకోవడానికి జగన్ ఎవరు? మీ భూమిపై వేరేవాళ్ల ఫొటోలెందుకు..? నువ్విచ్చావా...మీ నాన్న ఇచ్చాడా..? మీ తాత ఇచ్చాడా..? ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో.. వివాదాలు ఉన్న భూములపై పెత్తనం చేయడానికి పులివెందుల నుంచి తెచ్చుకున్న మనుషులతో పొలాలు, స్థలాలు కాజేసే కుట్రలు చేశారు. మీ జుట్టు జగన్ చేతుల్లో పెట్టుకుని పాలించాడు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్...

ఏడుగురు మావోయిస్టులు మృతి

మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి,కామరెడ్డి జిల్లాకు చెందిన లోకేటి చందర్‌రావు





గడ్చిరోలి/భువనేశ్వర్/కామారెడ్డి, ఫిబ్రవరి 6

ఛత్తీస్‌గఢ్ -మహారాష్ట్ర సరిహద్దుల్లో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి, తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన లోకేటి చందర్‌రావు అలియాస్ సహా ఏడుగురు మావోయిస్టులు, ఒక జవాను మృతి చెందారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు గడ్చిరోలి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు మూడు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించగా, శుక్రవారం ఉదయం మరో నలుగురి మృతదేహాలు లభ్యమైనట్టు గడ్చిరోలి పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో దీపక్ చిన్నా మడావి, జోగా మడావి అనే ఇద్దరు జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వారిని హెలికాప్టర్‌లో భమ్రాగడ్‌లోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో దీపక్ చనిపోయారు. ఘటనా స్థలంలో మూడు ఏకే-47 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. కాగా, ఒడిశా మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు నిరంజన్ రౌత్ అలియాస్ నిఖిల్, ఆయన భార్య రష్మీరా లెంక అలియాస్ ఇందుతోపాటు 19 మంది మావోయిస్టులు శుక్రవారం ఆ రాష్ట్ర పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిరంజన్‌రౌత్, రష్మీరా దంపతులపై రూ.55లక్షల చొప్పున రివార్డు ఉంది. గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి, పశ్చిమ సబ్‌జోనల్ బ్యూరో సభ్యుడు లోకేటి చందర్‌రావు(61) స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడి గ్రామం. మూడున్నర దశాబ్దాల క్రితం అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరిన ఆయన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దళ కమాండర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత దండకారణ్యానికి వెళ్లారు. చందర్ భార్య సులోచన కూడా భర్తతో కలిసి అడవి బాట పట్టారు. వారి కుమారుడు రమేశ్, కూతురు లావణ్య కూడా 2009లో మావోయిస్టు పార్టీలో చేరారు. సులోచన 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో దండకారణ్యంలో మరణించారు. కుమారుడు రమేశ్ ఇటీవల లొంగిపోగా, కుమార్తె లావణ్య ఛత్తీసగఢ్‌లో అరెస్టయ్యారు.

## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి..

69 మంది మృతి

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6 :**

ఇస్లామాబాద్‌లోని ఓ మసీదు వద్ద శుక్రవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 69 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడిని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖండించారు. తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు నగరంలోని షెహజాద్ టౌన్ ఏరియాలో షియా వర్గ ప్రజలు ప్రార్థనలు నిర్వహించే తర్లాయ్ ఇమామ్‌బార్గా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వాస్తవానికి అక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఆత్మాహుతి బాంబర్‌ను గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో, సూసైడ్ బాంబర్ అక్కడికక్కడే తనను తాను పేల్చుకున్నాడు. గేట్ వద్దే సూసైడ్ బాంబర్‌ను అడ్డుకోకపోయి ఉంటే మరింత ప్రమాదం జరిగి ఉండేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో బీభత్స వాతావరణం నెలకొంది. మృతదేహాలు, శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి భయానక వాతావరణం కనిపించింది. ఆత్మాహుతి దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్ ఐజీ నగరంలో అత్యయిక స్థితిని విధించారు. ఇక ఘట నా స్థలానికి చేరుకున్న అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తాజా దాడి చేసిన సూసైడ్ బాంబర్‌కు ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఏ-తాలిబాన్‌తో సంబంధం ఉండొచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తు న్నాయి. బలోచిస్థాన్‌కు చెందిన వేర్పాటు వాద సంస్థ బీఎల్ఏ ఈ దాడి చేసి ఉండొచ్చన్న అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. దాడులకు బాధ్యత వహిస్తూ ఇంతవరకూ ఏ సంస్థా ముం దుకు రాకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది.

# యూరిక్ యాసిడ్‌కు పండ్లతో చెక్



ప్రస్తుతం చాలామందిలో యూరిక్ యాసిడ్ అనేది ఓ సాధారణ అనారోగ్యంగా మారిపోయింది. ఒకప్పుడు పెద్దల్లో మాత్రమే కనిపించే ఈ సమస్య.. ఇప్పుడు యువతనూ ఇబ్బంది పెడుతున్నది. అయితే, కొన్ని పండ్లను ఆహారంలో భాగం చేసుకుంటే.. యూరిక్ యాసిడ్ సమస్యకు ఇట్టే చెక్ పడుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. అలాంటి పండ్ల జాబితాలోకి వెళ్తే.. దోసకాయలు: 90% కంటే ఎక్కువ నీటితో నిండి ఉండే దోసకాయలను.. పరిపూర్ణ మూత్రవిసర్జన ఆహారంగా చెబుతుంటారు. ఇవి మూత్ర విసర్జనను పెంచడం ద్వారా.. యూరిక్ యాసిడ్‌ను బయటికి పంపడంలో సాయపడతాయి. దోసకాయలోని ఆల్కలిన్ గుణాలు.. శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను తటస్థీకరించడంలో సమర్థంగా పనిచేస్తాయి.

**పుచ్చకాయ:**
నీరు, పొటాషియంతో నిండిన హైడ్రేటింగ్ పండు.. పుచ్చకాయ. ఇది యూరిక్ యాసిడ్‌ను పలుచన చేసి.. మూత్రం ద్వారా బయటికి పంపించేస్తుంది. ఇక పుచ్చకాయలోని సుగుణాలు.. మూత్రపిండాల పనితీరుకు మద్దతునిస్తాయి.

**బొప్పాయి:**
జీర్ణక్రియకు ఉపశమనం కలిగించడంతోపాటు యూరిక్ యాసిడ్ స్థాయులను తగ్గించడంలో బొప్పాయి కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలోని పాపైన్ అనే ఎంజైమ్.. కాలేయంతోపాటు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి.

**బెర్రీ పండ్లు:**
యాంటి ఆక్సిడెంట్లతో నిండిన బెర్రీ పండ్లలో.. విటమిన్ సి, పాలీఫెనాల్స్ కూడా అధికమే! ఇవి శరీరంలో పేరుకుపోయిన యూరిక్ యాసిడ్‌ను తగ్గించి.. టాక్సిన్స్‌ను బయటికి పంపేస్తాయి. ఉదయపు బ్రేక్‌ఫాస్ట్‌లో యోగర్ట్‌తో కలిపి బెర్రీ పండ్లను తీసుకుంటే.. అద్భుతమైన ప్రయోజనాలు అందుతాయి.


**సిట్రస్ పండ్లు:**
నిమ్మకాయ, ఆరెంజ్, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. యూరిక్ యాసిడ్ స్థాయులను నియంత్రణలో ఉంచడంలో విటమిన్ సి సమర్థంగా పనిచేస్తుంది. కిడ్నీల పనితీరునూ మెరుగుపరుస్తుంది. ఇది శరీర ఆల్కలైజ్‌కు సహాయపడి.. ఎసిడిటీని తగ్గిస్తుంది. ప్రతిరోజూ నిమ్మకాయ రసం తాగడాన్ని అలవాటుగా మార్చుకుంటే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

**చెర్రీ పండ్లు:**
ఎర్రగా, చిన్నగా ఉండే చెర్రీలలో.. ఆంథోసినైనిన్స్, యాంటి ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంట, నొప్పుల సమస్యను తగ్గిస్తాయి. యూరిక్ యాసిడ్ స్థాయులను సమతుల్యం చేయడంలోనూ చెర్రీ పండ్లు ముందుంటాయి.

# బిఆర్ఎస్ జిమ్మిక్కులు చెన్నూరు నియోజకవర్గంలో పని చేయవు..

### మంత్రి గడ్డం వివేక్..

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 06, (మన సమాజం):** చెన్నూరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసిన పని చేయవని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 19, 20 వార్డులలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బాగంగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగరేణి లాభాలను గణనీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచితే, గత బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సొమ్మును వాడి కార్మికులకు నష్టాన్ని మిగిలించిందని ఆరోపించారు. నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో సరైన శిక్షణ ఇప్పించడం జరుగుతుందని త్వరలోనే అనుకూల డిపార్ట్మెంట్ లలో ఉద్యోగాలను కల్పిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తోనే క్యాతనపల్లిలో అభివృద్ధి



సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి క్యాతనపల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, అభ్యర్థులు మంతెన మల్లమ్మ, రామగిరి శ్రీనివాస్, గాండ్ల వీణ – సమ్మయ్య, కూతురు ప్రభాకర్, నాయకులు యాకుబ్ అలీ, కొక్కుల సతీష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో స్కీంలు పోయి స్కాంలొచ్చే..

**- అభివృద్ధి అటకెక్కే, సంక్షేమ పథకాలు పాయె,**

**- ఎట్లుండే నా తెలంగాణ ఎట్లాయే.? - మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన..**





**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 06, (మన సమాజం):** కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణిలో స్కీంలు పోయి స్కాంలొచ్చే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బాగంగా స్థానిక రాజీవ్ చౌక్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశ సభలో మాట్లాడారు. అభివృద్ధి అటకెక్కే, సంక్షేమ పథకాలు పాయె, ఎట్లుండే నా తెలంగాణ ఎట్లాయే అని ఆవేదన వ్యక్తం చేశారు. సిరుల గనిగా ఉన్న సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యంతో డీజిల్ స్కాం, 6వేల కోట్ల టెండర్ లు స్కాంతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి నెలకొందని, కేసీఆర్ పునరుద్ధరించిన డిపెండెంట్ ఉద్యోగాలను సీఎం రేవంత్ రెడ్డి ఊసే లేకుండా చేశారని మండిపడ్డారు. 16500 మందికి డిపెండెంట్ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కేసీఆర్ కు మాత్రమే దక్కిందన్నారు. సింగరేణిని, కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుంటే కార్మిక మంత్రిగా ఉన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఎందుకు నోరు మెదపడటం లేదని ప్రశ్నించారు.

**రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఆగం..**

గడిచిన రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఆగమైందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు 2500 రూపాయలు, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం, 4వేల రూపాయల పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇలా ఇచ్చిన హామీలను, చేసిన స్కాంలని ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నాట్ల నాట్లకు రైతు బంధు ఇస్తే రేవంత్ హయంలో ఓట్లకు రైతు బంధు ఇస్తున్నారని ఎద్దేవాచేశారు.

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికలు గుణపాఠం కావాలని, క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు కలిసి వచ్చిన సిపిఐ పార్టీతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న అన్ని స్థానాల్లో బారి మెజార్టీతో గెలిపించాలని కోరారు..

**మున్సిపాలిటీలను 200 కోట్లతో అభివృద్ధి చేస్తా..**
**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్..**

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగిరితే వచ్చే అసెంబ్లీ ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లోనే క్యాతనపల్లి, చెన్నూరు మున్సిపాలిటీల అభివృద్ధికి 200 కోట్ల రూపాయల నిధులను తీసుకొస్తానని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల హడావుడితోనే నియోజకవర్గంలో మంత్రి అభివృద్ధి పేరిట శంకుస్థాపనలు చేశారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఆర్వోబి పనులు 90శాతం పూర్తి అయ్యాయని గుర్తుచేశారు. కన్నీరు పెడుతున్న క్యాతనపల్లికి పూర్వ వైభవం రావాలంటే బిఆర్ఎస్ సీపీఐ కలిసి పోటీ చేస్తున్న 22 స్థానాలలో అభ్యర్థులను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

**కాంగ్రెస్ నుండి సింగరేణి కాపాడుకుందాం.**
**ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య..**

కాంగ్రెస్ నుండి సింగరేణి కాపాడుకోవాల్సిన సమయం వచ్చిందని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య అన్నారు. ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంత్రిగా ఉన్న వివేక్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సింగరేణి క్షేత్రంగా ఉన్న క్యాతనపల్లి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, బిఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ పల్లె భూమేష్, నాయకులు రాజరమేష్, మూల రాజిరెడ్డి, రామడుగు లక్ష్మణ్, సుదర్శన్ గౌడ్, మిట్టపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఈ విత్తనాల గురించి మీకు తెలుసా..?

### ఎన్నో అద్భుతమైన లాభాలను అందిస్తాయి..!



మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడంతోపాటు మనకు అనేక పోషకాలను అందించే విత్తనాలు, గింజలు మనకు చాలానే అందుబాటులో ఉన్నాయి. అయితే దాదాపు అన్ని రకాల గింజలు, విత్తనాల గురించి చాలా మందికి తెలుసు. కానీ కొన్ని రకాల విత్తనాల గురించి ఇంకా చాలా మందికి అవగాహన లేదు. అలాంటి విత్తనాల్లో కాలోంజి విత్తనాలు కూడా ఒకటి. వీటినే నైగెల్లా సీడ్స్ అని కూడా పిలుస్తారు. అయితే వీటిని చాలా మంది నల్ల జీలకర్రగా భావిస్తారు. కానీ నల్ల జీలకర్ర వేరు, కాలోంజి విత్తనాలు వేరు. నల్ల జీలకర్ర చూసేందుకు సాధారణ జీలకర్ర మాదిరిగానే ఉంటుంది. కానీ సాధారణ జీలకర్రతో పోలిస్తే కాస్త నలుపు రంగులో ఉంటుంది. ఇక కాలోంజి విత్తనాలు లావుగా నల్లగా ఉంటాయి. కనుక నల్ల జీలకర్ర, కాలోంజి విత్తనాలు వేరే అని చెప్పవచ్చు. ఇక కాలోంజి విత్తనాలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజ నాలను కలిగిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి.

**ఆర్థరైటిస్ సమస్యకు..**

కాలోంజి విత్తనాలను తీసుకోవడం వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గుతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఉపశమనం లభిస్తుంది. ఈ విత్తనాలను తినడం వల్ల ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించుకోవచ్చు. దీంతో వాపులు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతాయి. దీని వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శ్వాసకోశ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో ఆస్తమా, దగ్గు, జలుబు, అలర్జీల వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి.

**కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..**

ఈ విత్తనాలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయి లు నియంత్రణలో ఉంటాయి. శరీరం లోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అలాగే ఈ విత్తనాలను తింటుంటే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. అందువల్ల హైబీపీ ఉన్నవారికి ఈ విత్తనాలు ఎంతో మేలు చేస్తాయి. ఇక ఈ విత్తనాలను తినడం వల్ల లివర్ పనితీరు సైతం మెరుగు పడుతుంది. లివర్‌లో ఉండే కొవ్వులు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోయి లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్‌ఉన్నవారికిఎంతో మేలు జరుగు తుంది. ఈ విత్తనాలను తింటుం టే ఇన్‌ఫెక్షన్ల ను తగ్గించుకోవచ్చు. వీటిల్లో యాంటీ బ్యాక్టీ రియల్, యాంటీ వైరల్, యాం టీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గి స్తాయి. ముఖ్యంగాజీర్ణాశయ,చర్మ సం బంధిత ఇన్‌ఫెక్షన్లను, వ్యాధులను తగ్గించు కోవచ్చు.


ఈ విత్తనాలను తింటుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతు ంది. గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. కాలోంజి విత్తనాలను శిరోజాలు, చర్మానికి సైతం ఉపయోగించవచ్చు. ఈ విత్తనాల నుంచి తయారు చేసే నూనె మనకు మార్కె ట్‌లో లభిస్తుంది. దీన్ని అనేక రకాల చర్మ సమస్యలకు ఔషధంగా ఉపయోగించవచ్చు. ఈ నూనెను రాయడం వల్ల ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు, ఇతర చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. ఇక ఈ విత్తనాలు కాస్త చేదుగా, ఘాటుగా ఉంటాయి. కనుక వీటిని నేరుగా తినలేరు. కాబట్టి వీటిని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా వీటిని పొడిగా చేసి మీరు తినే వంటకాలపై చల్లి తినవచ్చు. ఈ విధంగా కాలోంజి విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి.

# నెయ్యితో ఇంటి చిట్కాలు..

### ఏయే అనారోగ్య సమస్యలకు నెయ్యిని ఎలా ఉపయోగించాలంటే..?

భారతీయులు నెయ్యిని ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగి స్తున్నారు. ఒకప్పుడు దాదాపుగా అందరు ఇళ్లలోనూ నెయ్యి ఉండేది. కానీ ఇప్పుడు నెయ్యిని బయట కొనాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే ఆయుర్వేద ప్రకారం నెయ్యిలో అనేక ఔషధ గుణాలు, పోషకాలు ఉంటాయి. అందువల్ల నెయ్యిని తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజ నాలను పొందవచ్చు. నెయ్యిలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇందులో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఎ, డి, ఇ, కె, బ్యుటీరిక్ యాసిడ్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఒకప్పుడు చాలా మంది రోజూ నెయ్యిని భోజనంలో తినేవారు. కానీ ఇప్పుడు అలా తినడం లేదు. కనీసం చిన్నారులకు సైతం నెయ్యిని తినిపించడం లేదు. అయితే నెయ్యితో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ దీన్ని పలు ఇంటి చిట్కాల్లో ఎలా ఉపయోగించాలి, దీంతో ఎలాంటి అనారోగ్య సమస్యలను ఏవిధంగా నయం చేసుకోవచ్చు.. అని చాలా మందికి తెలియదు. ఈ క్రమంలోనే ఈ విషయాలను ఆయుర్వేద వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం చాలా మందికి మలబద్దకం సమస్య ఉంటోంది. అలాంటి వారికి నెయ్యి అద్భుతంగా పనిచేస్తుంది. ఒక టీస్పూన్ నెయ్యిని కరిగించి దాన్ని రాత్రి పూట నిద్రకు ముందు ఒకటీస్పూన్ మోతాదులో సేవించాలి. లేదా ఉదయం పరగడుపునే కూడా తీసుకోవచ్చు. ఇలా చేస్తుంటే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది. నెయ్యిలో ఉండే బ్యుటీరిక్ యాసిడ్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. అలాగే ఈ యాసిడ్ వల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి సమస్య ఉండదు. దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నవారు నెయ్యిని కరిగించి రెండు చుక్కల మోతాదులో రెండు ముక్కు రంధ్రాల్లోనూ వేస్తుండాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయాలి. దీని వల్ల కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**బరువు తగ్గేందుకు..**



నెయ్యి అంటే కొవ్వులు ఉంటాయి కనుక దీన్ని తింటే బరువు పెరుగుతారని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. మరీ అధికంగా నెయ్యిని తిన్నా, దీంతో వేపుడు వంటి పదార్థాలను, తీపి పదార్థాలను చేసి తిన్నా బరువు పెరుగుతారు. కానీ నెయ్యిని నేరుగా తీసుకుంటే బరువు తగ్గుతారు. నెయ్యిని రోజూ ఒక టీస్పూన్ మోతాదులో ఉదయం పరగడుపునే తింటుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, శరీరానికి అవసరం అయిన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కొవ్వు కణాలపై పనిచేస్తాయి. కొవ్వు కరిగేలా చేస్తాయి. నెయ్యిలో ఉండే ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు కూడా కొవ్వును కరిగించేందుకు సహాయం చేస్తాయి. కనుక నెయ్యిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ కనీసం ఒక టీస్పూన్ మోతాదులో నెయ్యిని తింటుంటే ఉపయోగం ఉంటుంది. దీంతో బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఇక షుగర్ ఉన్నవారికి కూడా నెయ్యి మేలు చేస్తుంది. సాధారణంగా షుగర్ ఉన్నవారు అన్నం తినేందుకు వెనుకాడుతారు. చపాతీలను అధికంగా తింటారు. కానీ నెయ్యి వేసి కలిపితే అన్నం గ్లైసీమిక్ ఇండెక్స్ తగ్గుతుంది. దీంతో అలాంటి అన్నాన్ని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగవు. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు అన్నాన్ని తినదలిస్తే కాస్త నెయ్యి వేసి తింటే ఉపయోగం ఉంటుంది. అలాగే నెయ్యిని చపాతీలపై వేసి కాల్చి కూడా తినవచ్చు. ఇలా చేసినా కూడా చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ తగ్గుతుంది. దీంతో అలాంటి చపాతీలను తింటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఇలా డయాబెటిస్ ఉన్నవారికి నెయ్యి మేలు చేస్తుంది. ఇక చర్మాన్ని రక్షించుకోవడం కోసం కూడా నెయ్యి పనిచేస్తుంది. నెయ్యిని కాస్త తీసుకుని అందులో కొద్దిగా శనగపిండి, పసుపు, నీళ్లు వేపి కలిపి మెత్తని పేస్టులా మార్చాలి.

# ఉద్యమాల గడ్డ నుంచి..
# ప్రజా సేవ బాట దిశగా..!

## అభివృద్ధి మంత్రం ఏకైక నినాదంగా క్రియాశీల రాజకీయాలకు నాంది

- పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళతాం
- 48వ డివిజన్‌లో బీజేపీ కార్పోరేటర్ అభ్యర్థిగా బందెల స్వాతి రవీందర్ రాజకీయ అరంగేట్రం
- తెలంగాణ ఉద్యమ వారసత్వం నుంచి మున్సిపల్ రాజకీయాల వరకు
- చదువుకున్న కుటుంబ నేపథ్యంతో అభివృద్ధే అజెండాగా బీజేపీ అభ్యర్థి దూకుడు



**మంచిర్యాల ఫిబ్రవరి 06,(మన సమాజం) :** తెలంగాణ ఉద్యమాల గడ్డగా పేరొందిన మంచిర్యాలలో ఇప్పుడు మరో రాజకీయ అధ్యాయం మొదలవుతోంది. ఉద్యమ కుటుంబ నేపథ్యంతో, ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయ అరంగేట్రం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బందెల స్వాతి రవీందర్ 48వ డివిజన్‌లో ఫ్రంట్ రన్నర్‌గా నిలుస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో జేఏసీ నాయకుడిగా కీలక పోరాటాలకు నాయకత్వం వహించిన స్వాతి మామ బాబన్న ప్రభావంతో, ఉద్యమ స్ఫూర్తిని దగ్గర నుంచి చూసి పెరిగిన స్వాతి... ప్రజా సమస్యల పట్ల సహజ అవగాహనతో రాజకీయాల్లోకి అడుగుపెడుతు న్నారు. ఉద్యమాలు అంటే నినాదాలు మాత్రమే కాదు... బాధ్యత, త్యాగం, ప్రజల పక్షాన నిలబడటం అన్న భావన తనలో బలంగా నాటుకుపోయిందని ఆమె మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. చదువుకున్న కుటుంబం నుంచి వచ్చిన స్వాతి రవీందర్, భావోద్వేగాలతో పాటు అభివృద్ధి ఆలోచనలను ముందుకు తీసుకొచ్చే నాయకత్వంగా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నారు. ప్రజాసేవే పరమావధిగా, అభివృద్ధి కార్యక్రమాలే తన రాజకీయ పెన్నిధిగా ముందుకు సాగుతున్నానని ఆమె స్పష్టం చేస్తున్నారు.

48వ డివిజన్‌లో ఏళ్లుగా పేరుకుపోయిన రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలను నేరుగా ప్రజల ముందుకు తీసుకెళ్తూ, అవకాశం ఇస్తే వీటినే తొలి ప్రాధాన్యతగా పరిష్కరిస్తానని స్వాతి గట్టిగా చెబుతున్నారు. మాటలకే పరిమితం కాకుండా, ప్రజల చెంతనే ఉండి పనిచేసే పాలన తన లక్ష్యమని ఆమె పేర్కొంటున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి, ఉపాధి కల్పన విధానాలను స్థానిక స్థాయికి తీసుకురావడమే తన అజెండా అని స్వాతి ప్రకటించారు. ఉద్యోగాల లేమితో దారి తప్పుతున్న యువతను కేంద్ర ప్రభుత్వ స్వయం ఉపాధి, ఉపాధి పథకాలతో ముందుకు నడిపిస్తానన్న ఆమె మాటలు యువతలో కొత్త ఆశను కలిగిస్తున్నాయి. డబ్బు చుట్టూ తిరిగే నేటి రాజకీయాల్లో, "డబ్బు కాదు–అభివృద్ధే అసలైన రాజకీయ ధ్యేయం" అనే స్పష్టమైన వైఖరితో ప్రజల ముందు కు రావడం స్వాతిని ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఉద్యమాల నుంచి వచ్చిన రాజకీయ స్ఫూర్తి, చదువుకున్న కుటుంబ నేపథ్యం, పారదర్శక పాలనపై నమ్మకం–ఇవన్నీ ఆమె ప్రచారానికి బలమైన ఆయుధాలుగా మారుతున్నాయి. మహిళా అభ్యర్థిగా, ప్రజల ఆడపడుచుగా తనను ఆదరించాలని కోరుతున్న స్వాతి... కార్పొరేటర్‌గా అవకాశం లభిస్తే ప్రజల మధ్యే ఉండి, ప్రజల సమక్షంలోనే పాలన సాగిస్తానని తేటతెల్లం చేస్తున్నారు. "పారదర్శక పాలన–అభివృద్ధే ధ్యేయం" అనే నినాదంతో సాగుతున్న ఆమె రాజకీయ ప్రయాణం, 48వ డివిజన్‌లో ఈసారి మార్పు ఖాయమన్న సంకేతాలను ఇస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# అధికారం చేతిలో ఉన్నా ఆందోళన..

## - సర్వే ఫలితాలపై సతమతం అవుతున్న కాంగ్రెస్ - ఎనిమిది సీట్లకే పరిమితమైన అధికారపార్టీ ఆశలు



**చెన్నూరు, ఫిబ్రవరి 06,(మన సమాజం) :** అధికారం చేతుల్లో ఉన్నా కాంగ్రెస్ పార్టీ నేతలకు కునుకులేకుండా పోతుందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు గోదావరి నదికి కరకట్టల నిర్మాణం, 45వేల ఉద్యోగాల కల్పన వంటి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రకటించిన ప్రత్యేక హామీలు అమలు చేయడంలో విఫలం అవడంతో నేడు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భరిలో నిలిచిన అభ్యర్థులకు తలనొప్పిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెన్నూరు మున్సిపల్ పరిధిలో కనీసం ఎనిమిది కౌన్సిలర్ సీట్లు దక్కించుకున్నా చాలనుకునే స్థాయిలో కాంగ్రెస్ నేతలున్నారు. టికెట్ల కేటాయింపులోనూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారిని కాదని ఖర్చులు భరించేవారికే ప్రాధాన్యతనిచ్చారనే విమ ర్శలు వెల్లువెత్తుతు న్నాయి. తన నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు, అక్రమాలకు తావివ్వబోమని బహిరంగ ప్రకటనలు చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఇటీవలే చెన్నూరు శనిగకుంట మత్తడి పేల్చివేత కీలక సూత్రదారులను పార్టీలో చేర్చుకోవడమే కాకుండా గత కొన్నేళ్లుగా అనుముల కుంటను ఆక్రమించి పత్తిమిల్లు నిర్మాణం చేపట్టిన మరో నేతకు మంత్రివర్యులు కొమ్ముకాస్తుండడంపై ప్రజలు నానా రకాలుగా చర్చించుకుంటుండగా, మరోవైపు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు అనూహ్యంగా ఆదరణ పెరుగు తుందనే వాదనలు వినిపిస్తు న్నాయి. నియోజ కవర్గంలో మారుతున్న రాజకీయ సమీకర ణాలు ప్రస్తుతం అధికారపార్టీ అభ్యర్థుల్లో ఓటమి భయం నెలకొంటుందని, చెన్నూరు మున్సి పాలిటీలో గల 18వార్డుల్లో కనీసం 8వార్డుల్లో విజయం సాధించినా చైర్మన్ పదవి అధికారపార్టీకి దక్కుతుం దనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి మంత్రి వ్యవహారిస్తున్న తీరుతో గడ్డు కాలం నడుస్తుందని, రెబల్ బెడద తీవ్రంగా ఉన్న కారణంగా ఇటీవలే జరిగిన స్థానిక ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, స్థానికంగా సెంకండ్ క్యాడర్ లేకపోవడంతో అభ్యర్థుల్లో ఓటమి భయం నెలకొంటుందని, ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అయినా చైర్మన్ పదవిని ఛేజిక్కించుకునేందుకు గానూ అధికారపార్టీ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తు న్నాయి. మరి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో చూడాలి మరి.

## కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమలే
## మున్సిపల్ ఎన్నికల్లో విజయాన్ని అందిస్తాయి

**కథలాపూర్ ఫిబ్రవరి 06**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార హవా కొనసాగుతున్న నేపథ్యంలో పెద్దలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు వేములవాడ నియోజకవర్గంలో గడప గడపకు ఎన్నికల ప్రచార కార్యక్రము కథలాపూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలిపించవలసిందిగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారితో కలిసి స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలసి ప్రచారం నిర్వహించడం జరిగింది.ప్రచార కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చేర్మెన్ పుంద్ర నారాయణ రెడ్డి, వైస్ చేర్మెన్ పులి శిరీష హరి ప్రసాద్, నాయకులు శంకర్, రమేష్ లు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

## శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతు న్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కా రం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

# అప్పులతో ఎంతకాలమీ పాలన !

**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబురించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఏపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి.



# అదృష్టం వెక్కిరించింది

రంగుల ప్రపంచంలో రాణించాలంటే.. అందం, అభినయంతోపాటు అదృష్టం కూడా ఉండాలని సినీపెద్దలు చెబుతుంటారు. ఆ కోవకే చెందుతుంది నటి చిత్రాంగద సింగ్. అందంలో అప్సరస, తెరపై గ్లామర్‌ను, అభినయాన్ని పండించడంలోనూ సిద్ధహస్తురాలు. అయినా.. ఇండస్ట్రీలో ఆమెకు తగినంత గుర్తింపు దక్కలేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో చిత్రాంగద మాట్లాడుతూ.. బాలీవుడ్‌కు మంచి స్టోరీ, స్క్రీన్‌ప్లే రైటర్స్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని చెప్పుకొచ్చింది. రచయిత తలచుకుంటే ఎంతపెద్ద హిట్ ఇవ్వగలడో చెప్పడానికి 'దురంధర్' సినిమానే మంచి ఉదాహరణ అంటూ అభిప్రాయపడింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన చిత్రాంగద.. మోడలింగ్ నుంచి బాలీవుడ్‌కు మారింది. 2005లో వచ్చిన 'హజారోన్ ఖ్వైషీన్ ఐసీ' అనే క్రైమ్ డ్రామాతో తెరపై కనిపించింది. ఆ తర్వాత ఆరేళ్లపాటు సినిమాలకు దూరమైంది. మళ్లీ 2011లో 'సింగ్ క్రైమ్ థ్రిల్లర్ యే సాలీ జిందగీ'తో తెరపై కనిపించింది. ఈ మధ్యలో ఎన్నో బ్లాక్?బస్టర్? సినిమాలను వదులుకున్నది. ఈ విషయంపైనా గతంలో ఓసారి స్పందిస్తూ.. "కెరీర్‌లో నేను ఎన్నో తప్పులు చేశాను. ఎన్నో బ్లాక్‌బస్టర్స్ వదులుకున్నాను" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నా.. ఒక హిట్‌ను కూడా అందుకోలేకపోయింది. అయినా.. అభిమానుల్లో మాత్రం బాగానే క్రేజ్ సంపాదించుకున్నది. చిత్రాంగద తాజా చిత్రాల సంగతి చూస్తే.. సల్మాన్ ఖాన్ హీరోగా వస్తున్న 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

# క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీకి నిర్మాతలు దొరకడం లేదా..?

టాలీవుడ్‌లో క్రియేటివ్ డైరెక్టర్‌గా తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ సొంతం



చేసుకున్నాడు కృష్ణవంశీ. ఒకానొక టైంలో బ్యాక్? టు బ్యాక్ సక్సెస్?లతో ఇండస్ట్రీని షేక్ చేసిన ఈ టాలెంటెడ్? డైరెక్టర్? చాలా కాలంగా మంచి బ్రేక్? కోసం ఎదురుచూస్తున్నాడని తెలిసిందే. ఫీల్ గుడ్? ఫ్యామిలీ ఎంటర్?టైనర్స్?, రొమాంటిక్ డ్రామాలను తెరకెక్కించడంలో కృష్ణవంశీ రూటే సెపరేట్? అనడంలో ఎలాంటి సందేహం లేదు.అయితే కృష్ణవంశీ చివరగా డైరెక్ట్? చేసిన రంగమార్తాండ బాక్సాఫీస్? వద్ద నిరాశనే మిగిల్చింది. ప్రతీ దర్శకుడి ప్రయాణంలో హిట్టు, ఫ్లాపులుంటాయి. మళ్లీ ట్రాక్?పైకి వచ్చేందుకు నానా తంటాలు పడుతుంటారు. ఇప్పుడలాంటి పరిస్థితే కృష్ణవంశీ ఎదుర్కొంటున్నాడంటూ నెట్టింట ఆసక్తికర చర్చ నడుస్తోంది. కృష్ణవంశీ తాజాగా'ప్రొడ్యూసర్స్?..?'అంటూ తాజాగా ఎక్స్?లో ట్వీట్ చేసి హాట్ టాపిక్?గా నిలిచాడు. కృష్ణవంశీకి నిర్మాతలు దొరకడం లేదని ఈ ట్వీట్?తో హింట్? ఇచ్చినట్టు అర్థమవుతుంది. బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపులను మూటగట్టుకున్న కృష్ణవంశీ తాను సిద్ధం చేసిన ఉత్తమ స్క్రిప్ట్?ను తెరకెక్కించే సరైన నిర్మాతను వెతకడంలో కృష్ణవంశీ ఫెయిలయ్యాడని తాజా ట్వీట్ చెప్పకనే చెబుతోంది. ఏ పాపులర్ ప్రొడ్యూసర్ కూడా కృష్ణవంశీ కథను తీయడానికి సిద్ధంగా లేరని తెలిసిపోతుంది. అయితే ఫ్లాపులతో సంబంధం తన ట్రేడ్? మార్క్? స్టైల్? సినిమా చేయాలంటే కృష్ణవంశీకి ఎప్పుడూ మద్దతుగా నిలుస్తున్నారు మూవీ లవర్స్?, ఫాలోవర్స్?. కానీ సరైన కథ ఉన్నా నిర్మాతలు దొరకడం కష్టంగా ఉందని తాజా ట్వీట్? క్లారిటీ ఇచ్చేస్తుంది. ఇదిలా ఉంటే ఖడ× హాఁబ౬ఱశీం కృష్ణవంశీ ట్వీట్?కు స్పందిస్తూ.. మీ బలాలకు అనుగుణంగా పనిచేస్తామని నమ్ముతున్న మాకు ఒక్క అవకాశమివ్వాలని కోరుతున్నామని రీట్వీట్ చేసింది. మరి కృష్ణవంశీ వారికి ఏదైనా అవకాశమిస్తాడేమో చూడాలి.

# మృణాల్- ధనుష్ పెళ్లి వార్తల వెనుక అసలు కథ..

సినీ ఇండస్ట్రీలో ఒక పుకారు మొదలైతే అది ఎంత వేగంగా వ్యాపిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజాగా అలాంటి ఒక రూమర్ సోషల్ మీడియాను హోరెత్తిస్తోంది. బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ త్వరలో వివాహం చేసుకోబోతున్నారనే వార్తలు కొన్ని రోజులుగా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. వాస్తవానికి వీరిద్దరూ కలిసి పబ్లిక్ ఈవెంట్స్?లో అరుదుగా మాత్రమే కనిపించారు. అయినా సరే, అదే ఆధారంగా ఇద్దరి మధ్య సన్నిహిత బంధం ఉందంటూ కథనాలు మొదలయ్యాయి. ఇక ఫిబ్రవరి 14న పెళ్లి అంటూ డేట్ కూడా ఫిక్స్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో ఈ రూమర్ మరింత బలపడింది. ఇందుకు తోడు మృణాల్ సోషల్ మీడియాలో షేర్ చేసే పోస్టులకు తరచూ తమిళ పాటలు జత చేయడం కూడా ఈ ఊహాగానాలకు కారణమైంది. ఆమె తమిళ ఇండస్ట్రీకి దగ్గరవుతోందని, అందుకే ధనుష్?తో రిలేషన్ ఉందని కొందరు నెటిజన్లు వ్యాఖ్యానించడంతో విషయం మరింత వైరల్?గా మారింది. ధనుష్ ఎప్పటిలాగే ఇలాంటి వార్తలపై స్పందించకుండా తన సినిమాలపైనే దృష్టి పెట్టారు. అయితే పెళ్లి వార్తలు హద్దు దాటడంతో మృణాల్ టీమ్ రంగంలోకి దిగింది. తాజాగా ఆమె టీమ్ విడుదల చేసిన ప్రకటనలో ఈ రూమర్స్‌కు పూర్తిగా చెక్ పెట్టింది. "మృణాల్ -- ధనుష్ పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఫిబ్రవరి 14న మృణాల్ వివాహం చేసుకోవడం లేదు. ప్రస్తుతం ఆమె వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఒక సినిమా త్వరలో రిలీజ్?కు సిద్ధమవుతుండగా, మరో సినిమా షూటింగ్‌లో ఉంది.



# ఊహ తెలిసినప్పటి నుంచే.. విక్కీ కౌశల్‌తో స్నేహంపై ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పిన మాళవిక

బాలీవుడ్ స్టార్‌హీరో విక్కీ కౌశల్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్నది యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్. ఇండస్ట్రీలోనే కాదు.. తన జీవితంలోనే మొదటి స్నేహితుడు విక్కీనే అంటున్నది. ఇద్దరివీ సినీ నేపథ్యమున్న కుటుంబాలే! మాళవిక తండ్రి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్ కాగా.. ఫైట్? మాస్టర్ శ్యామ్ కౌశల్ కుమారుడు విక్కీ కౌశల్. దాంతో వీరిద్దరి కుటుంబాలూ ముంబైలో ఇరుగుపొరుగునే ఉండేవట. బాల్యం నుంచే ఇద్దరి మధ్యా మంచి అనుబంధం ఉండేదట. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో మాళవిక మాట్లాడుతూ.. తన బాల్య సంగతులు, విక్కీతో అనుబంధం గురించి పంచుకున్నది.

"నాకు ఊహ తెలిసినప్పటి నుంచే విక్కీతో పరిచయం ఉంది. అప్పటి నుంచీ మా స్నేహం కొనసాగుతూనే ఉంది. చిన్నప్పుడు మా అమ్మ చేసే మలయాళీ వంటల్ని విక్కీ ఎంతో ఇష్ట పడేవాడు. అందుకే, తరచుగా మా ఇంటికి భోజనానికి వచ్చేవాడు. ఆ సమయంలో ఇద్దరం కలిసి కబుర్లు చెప్పుకొంటూ, భోజనం చేసేవాళ్లం" అంటూ చెప్పుకొచ్చింది. ఇక విక్కీ డ్యాన్సింగ్ ట్యాలెంట్ గురించీ వెల్లడించింది మాళవిక. చిన్నప్పటి నుంచే విక్కీ బాగా డాన్స్ చేసేవాడట. వేడుక ఏదైనా డ్యాన్స్‌తో అదరగొట్టేవాడంటూ బాల్య సంగతులను గుర్తు చేసుకున్నది. తామిద్దరం తరచుగా కలుస్తూనే ఉంటామనీ, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటామని వెల్లడించింది. సినిమాలు, కెరీర్?కు సంబంధించిన సీరియస్ విషయాలపై తామెప్పుడూ చర్చించలేదని చెప్పుకొచ్చింది. 2013లో వచ్చిన మలయాళ చిత్రం 'పట్టం పోలె'తో ఇండస్ట్రీలోకి వచ్చింది మాళవిక. ఆ తర్వాత రెండేళ్లకు 'మసాన్'తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చాడు విక్కీ కౌషల్. కెరీర్ మొదట్లో కొన్ని బాలారిష్టాలు ఎదుర్కొన్నా.. ప్రస్తుతం వీళ్లిద్దరూ స్టార్‌లుగా ఎదిగిపోయారు. మలయాళంతోపాటు తమిళం, హిందీలో సినిమాలు చేస్తున్న మాళవిక.. తాజాగా 'ది రాజా సాబ్'తో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ప్రభాస్ సరసన గ్లామర్ షోతో ఆకట్టుకుంది. కార్తీతో చేసిన 'సర్దార్ 2' కూడా త్వరలోనే విడుదల కానున్నది. ఇక విక్కీ విషయానికి వస్తే.. గతేడాది వచ్చిన హిస్టారికల్ చిత్రం 'ఛావా'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నాడు. దాదాపు రూ. 807 కోట్లతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. ప్రస్తుతం బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్?వార్' సినిమా చేస్తున్నాడు.